
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 7 ఆగస్టు 2024



ప్రత్యేక పూజలు.. కుంకుమార్చనలు

సిరిసిల్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలోని శ్రీరాజశ్యామల వారాహి సహిత, లలిత త్రిపుర సుందరి, అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ దేవాలయాల వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి గాజుల అలంకరణతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కోటి 8 లక్షల కుంకుమార్చన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



మూలన పడిన మగ్గాలు

నేడు జాతీయ చేనేత దినోత్సవం


తెగిపోతున్న 'పోగు' బంధం

- పథకాలు ఉన్నా నేతన్నలకు దూరమే
- ఆరేళ్లకు చేనేత సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు
- వృద్ధకార్మికులకే పరిమితమైన చేనేత
- మరమగ్గాల వైపే యువకుల మొగ్గు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత రంగం ప్రధానంగా ఉండేది. తాము బతకడంతోపాటు మరో పది మందికి ఉపాధి కల్పించిన చేనేత కార్మికులు కాలక్రమేనా సంభవిస్తున్న మార్పులతో కుల వృత్తిని వదిలి ఇతర వృత్తులు, చిరు వ్యాపారాల్లోకి వెళ్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న వారూ ఉన్నారు. జిల్లాలో చేనేత మగ్గం వృద్ధులకే పరిమితమవగా యువకులు మరమగ్గాలవైపు మళ్లారు. మరమగ్గాల వైపు వెళ్లిన యువకులు కూడా ఉపాధి లేక తల్లడిల్లుతున్న సంఘటనలే ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం చేనేత కార్మికులకు చేయూతను ఇచ్చే దిశగా పథకాలను ప్రవేశ పెడుతున్నా నేత కార్మికులకు అందని పరిస్థితి. సిరిసిల్ల జిల్లాలో ఒక నాడు చేనేత మగ్గాలతో కళకళలాడిన ప్రాంతాలు ఇప్పుడు ఆనవాళ్లనే కోల్పోయాయి. సిరిసిల్లలో మెట్‌పల్లి ఖాదీగ్రామోద్యో ప్రతిష్ఠతోపాటు కొన్ని సహకార సంఘాలు కార్మికులకు కొంత చేయూతను, ఉపాధిని కల్పిస్తున్నాయి. చేనేత కార్మికుడికి పదిహేను రోజులపాటు కష్టపడితే రూ.500 నుంచి రూ.800 వరకే కూలి లభిస్తోంది. చేనేత మగ్గాలకు కండెలు చుట్టే వృద్ధ మహిళలు ఒక నూలు లడి చుడితే రూ.6 నుంచి 10 రూపాయలు మాత్రమే లభిస్తాయి. పొద్దంతా చుడితే 50 రూపాయలు మాత్రమే గిట్టుబాటు అవుతుంది. చీరలోని గొప్పతనాన్ని చాటుతూ అగ్గిపెట్టెలో సైతం అమిరే చీర, కుట్టులేని దుస్తులు, మగ్గంపై మనుషుల చిత్రాలను నేసి ప్రపంచాన్ని అబ్బుర పరిచిన సిరిసిల్ల చేనేత పరిశ్రమ ఉనికిని మాత్రం కొందరు యువకులు బతికించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని యెల్ది హరిప్రసాద్, నల్ల విజయ్ చేనేత, మరమగ్గాలపై వినూత్నంగా వస్త్రాలను తయారు చేస్తున్నారు.

● సిరిసిల్లలో చేనేత విగ్రహం



సిరిసిల్ల అనగానే మొదట గుర్తుకు వచ్చేది చేనేత, పవర్‌లూం కార్మికులు. వస్త్ర సంక్షోభంతో ఎప్పుడూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎదుట సిరిసిల్ల సమస్యలతో ముందు ఉంటుంది. సిరిసిల్లలో చేనేత మగ్గాలతోపాటు 35 వేల మరమగ్గాలు, అనుబంధ పరిశ్రమలు ఉన్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా సిరిసిల్ల పాత బస్టాండ్‌లో 2010లో భారీ చేనేత కార్మికుడి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

● ప్రచారానికి నోచుకోని చేనేత ముద్ర

పవర్‌లూం, మిల్లు పోటీని తట్టుకోవడంలో చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులను గమనించిన కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలకు గుర్తింపు కోసం ప్రత్యేక మార్క్‌ను తయారు చేసింది. చేనేత వస్త్రాలపై ముద్రను వేయాలని నిర్ణయించారు. చేనేత చీరలు బట్టలుగా నిర్ధారించుకోవడానికి ఈ మార్క్ ఉపయోగపడుతుందని భావించారు. కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రవేశ పెట్టిన ఈ చేనేత ముద్ర నిర్లక్ష్యంతో ప్రచారంలోకి రాలేదు. మరమగ్గాలపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా అమ్మకాలు జరుపుతున్నా పట్టించుకోవడం లేదు.

● త్వరలో చేనేత సంఘాల ఎన్నికలు

చేనేత మగ్గమే లోకంగా భావిస్తున్నా చేనేత సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆరేళ్ల తరువాత మళ్లీ కసరత్తు మొదలు పెట్టింది. చేనేత జౌళి శాఖ అధికారులకు శిక్షణ ఇవ్వడంతో ఈ సారి ఎన్నికలు జరుగుతాయనే భావిస్తున్నారు. చేనేత దినోత్సవాన్ని ఆర్భాటంగా జరుపుతున్న చేనేత సంఘాల ఎన్నికలపై చూపుతున్న ప్రభుత్వ తీరును కార్మికులు నిరసిస్తూనే ఉన్నారు. కార్మికుల విమర్శల మధ్య ఎట్టకేలకు ఎన్నికల నిర్వహణకు ముందుకు వచ్చినా కార్మికులు మాత్రం అయోమయంగానే ఉన్నారు. పాలకవర్గాల గడువు ముగిసి ఆరేళ్లు దాటినా తరువాత వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న అన్ని సహకార సంఘాల కార్యవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర సహకార సంఘాల ఎన్నికల అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు చేనేత జౌళి శాఖ సభ్యుల జాబితాలను సిద్ధం చేస్తోంది. ఐదేళ్లకోసారి నిర్వహించాల్సిన చేనేత సహకార సంఘాల ఎన్నికలు 2013లో చివరి సారిగా చేపట్టారు. వారి పదవీ కాలం 2018 ఫిబ్రవరితో ముగిసింది. ఆ సమయంలోనే ఎన్నికలు నిర్వహించాలని 40 రోజుల ముందే నోటిఫికేషన్ జారీ చేసే విధంగా చేనేత కార్మికులతో ఓటు హక్కు అర్హత కలిగిన జాబితాను జౌళిశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మరోసారి ఎన్నికల నిర్వహణకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు.

లయ తప్పిన చేనేత మగ్గాలు



జిల్లాలో చేనేత మగ్గాలు లయ తప్పాయి. వేల సంఖ్యలో ఉన్న మగ్గాలు ఇప్పుడు వందల సంఖ్యలో చేరాయి. చేనేత మగ్గాలతో పోగు బంధం తెగిపోతోంది. చేనేత సహకార సొసైటీలు మూలనపడ్డాయి. ప్రస్తుతం జిల్లాలో రికార్డుల ప్రకారం 13 ఉన్నాయి. అందులో ఆరు సొసైటీలు మాత్రమే పనిచేస్తున్నాయి. చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు చేరాయి. జిల్లా కేంద్రంలో 35 వేల మరమగ్గాలపై బట్ట ఉత్పత్తి అవుతోంది. 1984లో సిరిసిల్ల జిల్లాలో చేనేత మగ్గాలు ఆరు వేల వరకు ఉండగా ఇప్పుడు 204 మగ్గాలకు చేరుకున్నాయి. ఈ మగ్గాలపై 325 మంది కార్మికులు మాత్రమే ఉపాధి పొందుతున్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత మిత్ర పథకాలను అందిస్తున్నారు. నూలు సబ్సిడీని ఇస్తున్నారు. ఈ పథకం ద్వారా 384 మంది కార్మికులకు రూ 4.21 లక్షలు విడుదల చేశారు. రూ లక్ష వరకు రుణమాఫీ చేశారు. చేనేత కళను బతికించడానికి కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం 2017లో చేనేత లక్ష్మి పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధ శాఖల ఉద్యోగులు 2662 మంది పథకంలో చేరారు. చేనేత లక్ష్మీ పథకంలో చేరిన ఉద్యోగులు బట్టలు కొనుగోలు చేశారు. ఈ పథకం మళ్లీ కొనసాగలేదు. వేములవాడ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్‌గా గుర్తించింది. క్లస్టర్ కింద రూ.1.19 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీనిలో భాగంగా రూ.50 లక్షలతో మౌలిక వసతుల కేంద్రం ఆధునిక డిజైనతో కార్మికులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టింది. మొదటి విడతలో రూ.19.10 లక్షలు విడుదల చేయగా 300మంది లబ్ధిదారులు కొత్త డిజైన్ల అభివృద్ధి, చేనేత శిక్షణను పొందారు. జిల్లాలో ప్రతీ సంవత్సరం రూ.1.50 కోట్ల చేనేత వస్త్రాలు ఉత్పత్తి అవుతున్నాయి. సిరిసిల్లలో మహేశ్వర సొసైటీ, సిరిసిల్ల సొసైటీ, జగదాంబ సొసైటీ, వేములవాడ, హన్మాజీపేట, మామిడిపెల్లి సొసైటీలతో పాటు ఖాదీగ్రామోద్యోగు, తంగళ్లపల్లి సొసైటీల్లో చేనేత మగ్గాలు కార్మికులకు ఉపాధిని అందిస్తున్నాయి.

అంజన్నను దర్శించుకున్న కలెక్టర్



అంజన్నను దర్శించుకుంటున్న కలెక్టర్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 6: అగ్రహారం క్రోడాంజనేయస్వామిని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా అంజన్న ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు.

నేడు చేనేత దినోత్సవ ర్యాలీ

సిరిసిల్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ఏడీ సాగర్ తెలిపారు. సిరిసిల్ల బీవైనగర్‌లోని చేనేత జౌళి శాఖ కార్యాలయం నుంచి పాత బస్టాండ్‌లోని నేతన్న చౌక్ వరకు ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం షాదీఖానాలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

సమయపాలన పాటించడం లేదని రైతు నిరసన

చందుర్తి,ఆగస్టు 6: చందుర్తి మండలం సనుగుల సహకార సంఘం సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఓ రైతు మంగళవారం నిరసన వ్యక్తం చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. లింగంపేటకు చెందిన ఆరె సంతోష్ యూరియా బస్తాల కోసం సనుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంకు ఉదయం 9 గంటల వెళ్లాడు. మధ్యాహ్నం వరకు సంఘం సిబ్బంది రాకపోవడంతో నిరసన వ్యక్తం చేశాడు. ఈ విషయమై సహకార సంఘం కార్యదర్శి శ్రీవర్ధన్ వివరణ కోరగా తాను కిష్టంపేట క్లస్టర్ గోదాంలో రైతులకు యూరియా బస్తాలను విక్రయించి, విధుల్లో భాగంగా చందుర్తి, రుద్రంగి వెళ్లినట్లు తెలిపారు. మిగతా సిబ్బంది ఇతర క్లసర్‌లకు వెళ్లారని పేర్కొన్నారు.

9న విక్రయ హక్కుల కోసం వేలం

ఇల్లంతకుంట, ఆగస్టు 6:మండలంలోని అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో విక్రయ హక్కుల కోసం 9న వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ అధికారి మారుతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డూ, పులిహోరా, ప్రసాదం కోసం రూ.లక్ష, కొబ్బరి ముక్కలు పోగుచేసుకునే హక్కు కోసం రూ.20వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ఏఎస్పీ శేషాద్రిని రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

కోనరావుపేట, ఆగస్టు 6: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రివచ్చని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం ఏఎస్పీ శేషాద్రిని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శేఖర్ రెడ్డి గ్రామస్థులు సన్మానించారు.

యువకుడిని అభినందించిన ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, ఆగస్టు 6: టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందిన మండలంలోని ఒగులాపూర్‌కు చెందిన ముక్కీస లోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు. ఇటీవల లోహిత్‌రెడ్డి పీఆర్ ఏఈఈ ఉద్యోగం సాధించాడు. మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో ఆదర్శంగా నిలవాలి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఇల్లంతకుంట, ఆగస్టు 6: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఆదర్శంగా నిలవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదిక ఆవరణలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి వెంకటి, నాయకులు మహేందర్‌రెడ్డి, బాలపోచయ్య, భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి, రాజు, లింగం, బాలరాజు, చంద్రమౌళి, కర్ణాకర్‌రెడ్డి, ప్రభాకర్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

మేకల మందపై చిరుత దాడి

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం గోరంటాల ఎద్దుగుట్ట అటవీ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మేకల మందపై చిరుత దాడి చేసింది. చిరుత ఒక్కసారి మేకల మందపై విరుచుక పడడంతో పరుగులు తీశాయి. మేకల కాపరి శ్రీనివాస్ కొద్దిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. తన చేతిలో ఉన్న గొడ్డలితో కాపరి బెదిరించే ప్రయత్నం చేయడంతో చిరుత అతడి వైపు వెళ్ల లేదు. చిరుత అక్కడి నుంచి వెళ్లే క్రమంలో ఓ మేకను ఎత్తుకెళ్లినట్టు కాపరి శ్రీనివాస్ తెలిపాడు.

మహిళల రక్షణకే షీటీంలు

రుద్రంగి, ఆగస్టు 6 మహిళలకు రక్షణ కల్పించేందుకు షీ టీమ్‌లు పనిచేస్తున్నట్లు షీ టీం ఇన్‌చార్జి, ఏఎస్సై ప్రమీళ తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆపద వేళల్లో 100కు డయల్ చేయాలన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు గురైనా షీ టీమ్‌కు సమాచారం అందివాలన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు ప్రణాళిక



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 6 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ మొదటి దశ అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులకు సూచించారు. రాజన్న ఆలయంలోని చైర్మన్ గెస్ట్ హౌస్‌లో ఇంజనీరింగ్, దేవాదాయ ధర్మదాయ శాఖ స్థపతి వల్లీ నాయగంతో కలిసి మంగళవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి, ప్రణాళిక మ్యాప్‌ను పరిశీలించి దేవాదాయ ధర్మదాయ శాఖ స్థపతి వల్లీ నాయగం, రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ప్లాన్, అంచానాలు సిద్దం చేయాలని చెప్పారు. ప్రణాళిక సిద్ధమైన తర్వాత శృంగేరి పీఠంవారితో చర్చించి సలహాలు, సూచనలు తీసుకోనున్నట్లు, పనులు త్వరితగతిన చేపట్టనున్నట్లు తెలిపారు.

సౌదీలో సిరిసిల్ల యువకుడి నరకయాతన

- స్వదేశానికి రప్పించాలని సీఎంకు సెల్ఫీ వీడియో
- సౌదీలోని ఇండియన్ ఎంబసీకి ప్రభుత్వ విప్ లేఖ

సిరిసిల్లక్రైం, ఆగస్టు 6: సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ అనే 23 ఏళ్ల యువకుడు సౌదీ అరేబియాలో నరకయాతన పడుతున్నాడు. అక్కడ పడుతున్న ఇబ్బందులను తెలుపుతూ మంగళవారం సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇమ్రాన్ ఉపాధికోసం సూపర్ మార్కెట్‌లో పనికోసం 45 రోజుల కిందట సౌదీ వెళ్లాడు. 15 రోజుల క్రితం సౌదీలో పైల్స్ సర్జరీ చేయించుకున్నాడు. ఆపరేషన్ చేయించుకున్నా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో తనను స్వదేశానికి పంపించాలని యాజమాన్యాన్ని కోరాడు. స్వదేశానికి పంపించకుండా తనను కొడుతున్నారని, చంపేస్తామని బెదిరిస్తున్నారని, ఏజెంట్ చెప్పిన పనికాకుండా మరో పని చేయిస్తున్నారని, తనకు ఆరోగ్యం బాగాలేదని వీడియోలో కన్నీళ్లు పెట్టుకున్నాడు. తనను కాపాడాలని, సౌదీ నుంచి స్వదేశానికి రప్పించాలని, ఇలాగే ఉంటే చనిపోతానంటూ సీఎంకు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి సెల్ఫీ వీడియో ద్వారా విజ్ఞప్తి చేశాడు. తనకు న్యాయం చేయకపోతే చావే దిక్కని ఆవేదన వ్యక్తం చేశాడు. వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో యువకుడి ఆవేదన విన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెంటనే ఇమ్రాన్‌ను ఇండియాకు పంపించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఇండియన్ ఎంబసీకి లేఖ రాశారు.

స్వరాష్ట్ర సాధనే శ్వాసగా బతికిన మహోన్నత వ్యక్తి జయశంకర్



నివాళులు అర్పిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 6: తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసి, స్వరాష్ట్ర సాధనే శ్వాసగా బతికిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో మంగళవారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రొఫెసర్ ఆశయ సాధన కోసం నిరంతరం పాటుపడుతామని, ఆయన ఆలోచన విధానాలను సీఎం రేవంత్‌రెడ్డి పునికి పుచ్చుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని అన్నారు. స్వరాష్ట్రం కోసం అమరులైన వారిని స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం ప్రజా ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. అమరుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత పాలకులు తెలంగాణ అమరులను, రాష్ట్రం కోసం పోరాడిన వారిని పక్కనపెట్టారని, సొంత ఆలోచనలతో పరిపాలన సాగించి బంగపడ్డారని విమర్శించారు. రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఆలయ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మద్యం షాపులో చోరీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6: కరీంనగర్ కోతిరాంపూర్‌లోని మానస వైన్‌షాపులో సోమవారం అర్ధరాత్రి దొంగ చొరబడి కౌంటర్‌లోని 35 వేల రూపాయలు ఎత్తుకుపోయాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి వైన్‌షాపును మూసివేసిన క్యాషియర్ తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి వైన్ షాపు షటర్ గోడ పగులగొట్టి,షటర్ బయటకు లాగి ఉంది. యజమానితో కలిసి లోపలికి వెళ్లి చూడగా కౌంటర్ తెరచి ఉండగా అందులోని 35 వేల రూపాయల నగదు దొంగ ఎత్తుకుపోయినట్లు గుర్తించారు. పోలీసులు షాపులోని సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగ చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. మరొక షాపులో కూడా చోరీకి ప్రయత్నించినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6: ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై మద్యం మత్తులో పురుగుల మందు తాగిన కరీంనగర్ రూరల్ మండలం చెర్ల బూత్కూర్‌కు చెందిన రంగు శ్రీనివాస్(41) చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. గీతకార్మిక వృత్తితో జీవిస్తున్న రంగు శ్రీనివాస్ అప్పుల బాధతో ఈనెల 4న కల్లు గీసేందుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి సోదరుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు.

రేషన్‌బియ్యం పట్టివేత

మల్యాల, ఆగస్టు 6: అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యంను సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మల్యాల మండల కేంద్రంలోని సంగని రాములు అనే వ్యక్తి ఇంటి సమీపంలో గుర్తు తెలియని కొందరు వ్యక్తులు రేషన్‌బియ్యంను అక్రమంగా తరలించడానికి నిల్వ చేశారనే సమాచారం మేరకు అక్కడకు వెళ్లిన డీటీసీఎస్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, బ్లూకోల్ట్ పోలీసులు ప్రసాద్, నర్సింగ్ ఇతర అధికారులు పది క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యంను మల్యాలలోని సివిల్ సప్లై గోదాంకు తరలించినట్లు పేర్కొన్నారు.

రామడుగు: మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు. వరంగల్ నుంచి మహరాష్ట్రకు తరలిస్తున్న లారీలో 200 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న కందుకూరి మహేష్‌బాబు అనే వ్యక్తి తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్ ఆలీమ్‌ఖాన్, గుమాస్తా ల్యాడ నరేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మేకల మందపై చిరుత దాడి

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం గోరంటాల ఎద్దుగుట్ట అటవీ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మేకల మందపై చిరుత దాడి చేసింది. చిరుత ఒక్కసారి మేకల మందపై విరుచుక పడడంతో పరుగులు తీశాయి. మేకల కాపరి శ్రీనివాస్ కొద్దిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. తన చేతిలో ఉన్న గొడ్డలితో కాపరి బెదిరించే ప్రయత్నం చేయడంతో చిరుత అతడి వైపు వెళ్లలేదు. చిరుత అక్కడి నుంచి వెళ్లే క్రమంలోట మేకను ఎత్తుకెళ్లినట్లు కాపరి శ్రీనివాస్ తెలిపాడు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు : తప్పిన ప్రమాదం



పొలంలో బోల్తాపడ్డ కారు

రుద్రంగి, ఆగస్టు 6: రుద్రంగి మండల కేంద్రం శివారులోని మూలమలుపు వద్ద సామవారం రాత్రి కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. సానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కారు రుద్రంగి నుంచి కోరుట్ల వైపు సోమవారం రాత్రి 11 గంటలకు వెళ్తుండగా మూలమాలుపు వద్ద ఒక్కసారిగా కారు అదుపు తప్పి పొలంలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. సంఘటన స్థలాన్ని రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ పరిశిలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూవివాదంలో రౌడీషీటర్ అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 6: మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన రౌడీషీటర్ భూపతి వెంకటేశ్‌ను భూవివాదంలో మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్ ఇదే గ్రామానికి చెందిన పైడి రేవతిపై గత నెలలో పారతో తలపై దాడిచేసి గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వెంకటేశంపై ఇప్పటికే ఆరు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

సైబర్ వలలో పిల్లల వైద్యుడు

● రూ. 74 లక్షలు కాజేసిన నేరగాళ్లు

మెట్‌పల్లి , ఆగస్టు 6 (ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ పిల్లల వైద్యుడు సైబర్ వలలో చిక్కుకుని ఏకంగా రూ.74 లక్షలు మోసపోయిన ఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పిల్లల వైద్యుడు స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసి డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో ఇన్‌స్టాగ్రాంలో ఓ లింక్‌ను క్లిక్ చేసి ఏసీ మ్యాక్స్ అనే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎసెల్ స్టూడెంట్ గ్రూప్‌ను ఫాలో అవుతూ డబ్బులు ఇన్వెస్ట్ చేసాడు. ఎంత డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే అంత పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని సైబర్ నేరగాళ్లు సదరు వైద్యుడిని నమ్మించారు. దీంతో వైద్యుడు మొత్తం 74 లక్షల రూపాయలు ఇన్వెస్ట్ చేసాడు. ఇన్వెస్ట్ చేసిన డబ్బులతో పాటు ఇంకా అధిక మొత్తంలో డబ్బులు రావాలంటే ఇంకా జమచేయాలని సైబర్ నేరగాళ్లు నమ్మించే ప్రయత్నం చేసారు. అనుమానం వచ్చిన వైద్యుడు తను ఇన్వెస్ట్ చేసిన డబ్బులు విత్‌డ్రా చేయాలని కోరగా ఇంకా 31 లక్షలు కడితేనే విత్ డ్రా అవుతుందని తెలుపడంతో మోసపోయినట్లు తెలుసుకుని 1930కి కాల్ చేసి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గత నెల 13న ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు మోసపోయిన 74,38,812 లక్షలలో 10 లక్షలు ఫ్రీజ్ చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర రావు తెలిపారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

17యేళ్ల తర్వాత రాజన్న ఆలయ ఉద్యోగుల బదిలీలు

● 27 మందికి ఉత్తర్వులు ● మూడు రోజుల్లో చేరాలని దేవాదాయశాఖ ఆదేశాలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 6: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఉద్యోగులను బదిలీ చేస్తూ ఎట్టకేలకు దేవాదాయ శాఖ నుంచి17యేళ్లకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 27 మంది ఉద్యోగులకు యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, బాసర, కొమురవెల్లి దేవాలయాలకు బదిలీచేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు విడుదల అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా యేళ్ల తరబడి ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేయాలనే దేవాదాయ శాఖ భావించి పెద్ద మొత్తంలో ఉద్యోగులకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే రాజన్న ఆలయానికి చెందిన ఇద్దరు ఏఈవోలు, ఏడుగురు పర్యవేక్షకులు, ఎనమిది మంది సీనియర్ అసిస్టెంట్‌లు, 10 మంది జూనియర్ అసిస్టెంట్‌లుతో పాటు డీఈని బదిలీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న మూడు రోజుల్లో సంబంధిత ఆలయాల్లో విధుల్లో చేరాలని బదిలీ ఉత్తర్వులో ఆదేశాలు జారీ చేశారు.



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం


రాజన్న ఆలయం నుంచి బదిలీ అయిన ఉద్యోగులు వీరే

రాజన్న ఆలయంలో ఏఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్న ఏఈవో ఎస్. హరికిషన్ శ్రీసీతరామచంద్ర స్వామి దేవాలయం భద్రాచలం బదిలీ అయ్యారు. ప్రతాప నవీన్‌కుమార్ శ్రీలక్ష్మీనరసింహా స్వామి ఆలయం యాదగిరిగుట్టకు బదిలీకాగా పర్యవేక్షకులు శ్రీరాములును శ్రీమల్లికార్జున స్వామి ఆలయం కొమురవెల్లికి, నటరాజును శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయం యాదగిరిగుట్టకు, హరిహరనాథ్‌ను శ్రీ ఆంజనేయస్వామి ఆలయం కొండగట్టుకు, లక్ష్మణ్‌రావును శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం బాసరకు, జి. శ్రీనివాస్, నాగుల మహేష్‌లను శ్రీలక్ష్మి నరసింహాస్వామి ఆలయం యాదగిరిగుట్టకు, అరుణ్‌కుమార్‌ను శ్రీసీతరామ చంద్ర స్వామి ఆలయం భద్రాచలం బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పత్తిపాక శ్రీనివాస్, పచ్చునూరి రాజేందర్, ఎమ్. రవీందర్, పవన్‌కుమార్, రమేష్‌లను శ్రీలక్ష్మినర్సింహాస్వామి ఆలయం యాదగిరిగుట్టకు, భూపతిరెడ్డి, అశోక్‌లను శ్రీఆంజనేయస్వామి ఆలయం కొండగట్టుకు, సిహెచ్. రాజేశ్వర్‌ను శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం బాసరకు బదిలీలు చేశారు. జూనియర్ అసిస్టెంట్‌లు విధులు నిర్వర్తిస్తున్న ఎన్. తిరుపతి, నగేష్‌రాజు, ఎల్. రాజేందర్, సిహెచ్. లింగయ్య, రామేశ్వరరావులను యాదగిరిగుట్ట శ్రీలక్ష్మినర్సింహాస్వామి వారి ఆలయానికి, సిహెచ్. శ్రీనివాస్ శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం బాసరకు, తూము శ్రీనివాస్, టి.రవి, ఎస్. నాంపల్లి, కె. రాములలను శ్రీఆంజనేయస్వామి ఆలయం కొండగట్టుకు, బి. శివరామ్‌ను శ్రీసీతరామచంద్ర స్వామి ఆలయం భద్రాచలం ఆలయాలకు బదిలీలు అయ్యారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తగ్గిన వరద నీరు

● రెండు మోటార్ల ద్వారా మిడ్ మానేరుకు ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 6: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఇక్కడి నుంచి మిడ్ మానేరుకు తరలిస్తున్న నీటిని అధికారులు తగ్గించారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 4,660 క్యూసెక్కుల వరద నీరు మాత్రమే వస్తున్నది. ఇక్కడి నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసిన అధికారులు సాయంత్రం వరకు ఒక మోటారును నిలిపివేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మరొక మోటార్‌ను నిలిపివేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.913 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. బుధవారం ఇన్‌ఫ్లో పెరగకపోతే మిగతా రెండు మోటర్లనూ నిలిపివేసే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు 11 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 9,980 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.98 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3. 5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో మంగళవారం సాయంత్రానికి 1.29 టీఎంసీల నీరు చేరింది. మధ్య మానేరు నుంచి సర్జిపూల్‌లోకి నీరు వచ్చిచేరుతుండడంతో రెండు మోటార్ల ద్వారా 6,400 క్యూసెక్కుల నీటి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నామని డీఈ దేవేందర్ తెలిపారు.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి వెళుతున్న నీరు

● ఎస్సారెస్పీకి 10,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 10,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 45.451 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక,ఆగస్టు6: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు మార్త రాజేశం,కర్రే మహేష్, కర్రే నర్సయ్యలపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. ప్రభుత్వం అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఆగస్టు 6: హుజూరాబాద్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ తెలిపారు. పట్టణంలోని మామిండ్లవాడలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 1630 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు టౌన్ సీఐ తిరుమల్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూకబ్జా కేసులో అధికారి సరెండర్?

జగిత్యాలరూరల్, ఆగస్టు 6: నకిలీపత్రాలు సృష్టించి విలువైన భూమిని కబ్జాకు యత్నించినవారికి సహకరించిన కేసులో గతంలో జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఓ అధికారి మంగళవారం జగిత్యాల కోర్టులో లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే జగిత్యాల పట్టణంలోని స్థానిక హస్నాబాద్ శివారులోగల సర్వేనంబర్ 1599లో గల 12 గుంటల స్థలం కబ్జాచేసిన వ్యవహారం జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. తమది కాదని తెలిసిన విలువైన భూమిని కాజేసేందుకు కుట్రపన్ని సదరుభూమికి సంబంధించిన నకిలీపత్రాలు సృష్టించుకున్న ఇద్దరు వ్యక్తులతో పాటు అక్రమంగా వీఎల్‌టీ నంబర్ కేటాయించి సహకరించించిన మున్సిపల్ ఆర్ఓ ప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. భూకబ్జా వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. అతనితో పాటు జగిత్యాలలో గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అధికారి సైతం పరారీలో ఉండగా మంగళవారం జగిత్యాల కోర్టులో లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం తెలిసింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ కర్ణన్

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 6: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆసుత్రిలో ఉన్న డాక్టర్లు, సిబ్బంది వివరాలతో పాటు సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల మీద నమ్మకం పెరిగే విధంగా రోగులకు వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు. ప్రసవాల కోసం వచ్చే వారిని ప్రైవేట్ ఆసుపత్రులకు పంపించ వద్దని, గర్భిణులు మాతా శిశు కేంద్రానికి వచ్చే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణిలకు మెరుగైన వైద్యం అందించాలి

సుల్తానాబాద్, ఆగస్టు 6: ప్రభుత్వ అసుపత్రుల్లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలని, ప్రభుత్వ అసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లతో మాట్లాడారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి వివరించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా ప్రసవాల సంఖ్య పెరిగే విషయంలో జిల్లా అధికారులు దృష్టి నిలపాలన్నారు. సీజనల్ వ్యాధులతో వస్తున్న రోగులకు సత్వర చికిత్సలు అందించాలని సూచించారు. ఆయన వెంట కలెక్టర్ కోయ శ్రీహర్ష, మహేందర్, సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, కమిషనర్ శోభశంకర్ తదితరులు ఉన్నారు.



సుల్తానాబాద్ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కర్ణన్

గంగాధరలో బస్సు, లారీ ఢీ

● లారీ డ్రైవర్ మృతి

● బస్సులోని ప్రయాణికులకు స్వల్పగాయాలు

గంగాధర, ఆగస్టు 6: గంగాధర మండలం కొండన్నపల్లి స్టేజి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి జిజే 06ఏఎక్స్7548 నెంబరు గల అయిల్ ట్యాంకర్ లారీ జగిత్యాల వైపు వెళ్తోంది. టీఎస్ 02 యూబి 7794 ఆర్టీసీ బస్సు నిండుగా ప్రయాణికులతో చిల్వాకోడూర్ నుండి కరీంనగర్ వెళ్తోంది. కొండన్నపల్లి స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న అయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఢీకొట్టగానే లారీ డ్రైవర్ అఫ్జల్ అలాంకు బలమైన గాయాలై వాహనం అదుపు కాలేక బస్సును కొద్ది దూరం లాక్కెల్లి నిలిచింది. అతికష్టం మీద లారీ డ్రైవర్‌ను స్థానికులు బయటకి తీసిన కొద్ది సమయంలోనే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ రాజుకు కాలు విరగగా 12 మంది ప్రయాణికులకు స్వల్పగాయ్యైనట్లు తెలిపారు. గాయపడ్డ ప్రయాణికులను 108లో కరీంనగర్‌కు తరలించారు. ఇదే సమయంలో బీర్‌పూర్ నుంచి కరీంనగర్ వెళ్తున్న టాటా ఏస్ ట్రాలీని వెనకనుండి బస్సు ఢీకొట్టింది. ట్రాలీ డ్రైవర్ వెంకటేశంకు కాలు విరిగింది. ట్రాలీ ముందు భాగం దెబ్బతినగా క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను కష్టంమీద బయటికి తీశారు. ఘటన స్థలానికి ఎస్‌ఐ కిరణ్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



కొండన్నపల్లి స్టేజీ వద్ద ఎదురెదురుగా ఢీకొన్న లారీ, బస్సు

పోలీస్‌స్టేషన్‌లో పందెం కోళ్ల వేలం

కమాన్‌పూర్, ఆగస్టు 6: కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం పందెం కోళ్ల వేలం పాట ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో రెండు పందెం కోళ్లకు రూ. 6,500 ధర పలికింది. ఒక పందెం కోడి రూ. 4 వేలకు మండల కేంద్రానికి చెందిన పురాణం సారయ్య దక్కించుకున్నారు. మరో పందెం కోడిని బోనాల సత్యనారాయణ రూ. 2500లకు దక్కించుకున్నాడు. ఈ పందెం కోళ్ల వేలం పాటలో వచ్చిన డబ్బులను కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. గత నెల 27న మండ లంలోని పెంచికల్‌పేట గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు జరిపారు. ఏడుగురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహించగా 50 మంది పాల్గొన్నారు.

జ్వరంతో పారిశుధ్య కార్మికుడి మృతి

రాయికల్, ఆగస్టు 6: మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన లింగయ్య(56) జ్వరంతో బాధ పడుతూ మంగళవారం మృతి చెందాడు. చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన లింగయ్య 12 ఏళ్లగా ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా రాయికల్‌లో పనిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న లింగయ్యను కుటుంబ సభ్యులు జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందజేస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి.. ప్రాణాపాయ స్థితిలోకి...

శంకరపట్నం, ఆగస్టు 6: శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో ఓ ఆర్ఎంపీ వైద్యం వికటించి ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన సంఘటన జరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి గ్రామానికి చెందిన ముంజ లక్ష్మయ్యకు ఈ నెల 4న సాయంత్రం విరోచనాలు కావడంతో గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. తాను రెండు ఇంజక్షన్లు వేశాడు. తగ్గకపోవడంతో మరుసటి రోజు ఉదయాన్నే ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా రెండు ఇంజక్షన్లు వేసి రెండు గ్లూకోజులు ఎక్కించినట్లు తెలిపారు. లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితి అదుపులో లేకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆర్‌ఎంపీ వైద్యం వికటించడం వల్లనే తన భర్త ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉన్నాడని భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

చిరుత దాడిలో మూగజీవాల మృత్యువాత

● భయం గుప్పిట్లో గ్రామాలు.. రైతులు ● ఇప్పటికే మూడు మూగజీవాలు మృతి

గంభీరావుపేట, ఆగస్ట్ 6: గంభీరావుపేట మండలం గోరంటాల, దమ్మన్నపేట సరిహద్దు అడవుల్లో చిరుత సంచారంతో ఆ గ్రామాలు భయం గుప్పిల్లో వణికి పోతున్నాయి. అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్ద ఉండే మూగ జీవాలపై చిరుత వరుసగా దాడి చేసి చంపుతోంది. నాలుగు రోజుల వ్యవధిలో చిరుత దాడిలో మూడు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. నాలుగు రోజుల క్రితం గోరంటాల గ్రామానికి చెందిన రైతు రామచంద్రంకు చెందిన రెండు ఆవులపై చిరుత దాడి చేసి చంపేసింది. పొలం వద్ద కొట్టంలో ఉన్న ఆవులపై దాడి చేసి చంపేయడంతో ఒక్కసారి పరిసర గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. ఈ సంఘటన మరువక ముందే దమ్మన్నపేట రైతు నారాయణకు చెందిన దూడపై ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి చంపేయడంతో ఈ ప్రాంత రైతులు భయం గుప్పిట్లో వణికి పోతున్నారు. దమ్మన్నపేట, గోరంటాల గ్రామాలు పెద్దమ అడవులకు సమీపంగా ఉండడంతో చిరుత సంచారం అధికమైనట్టు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో అటవీ ప్రాంతానికి అనుకొని ఉన్న ముచ్చర్ల గ్రామ సమీపాన చిరుత రెండు సార్లు దాడి చేసి రెండు మూగజీవాలను హతమార్చింది. రాత్రి వేళల్లో ముచ్చర్ల మార్గం గుండా వెళ్లాలంటే ప్రజలను చిరుత భయం వెంటాడింది. తాజాగా గోరంటాల, దమ్మన్నపేట గ్రామ సమీప పొలల వద్ద ఉన్న మూగ జీవాలపై చిరుత విరుచుకుపడి చంపుతోంది. దీంతో రాత్రి వేళల్లో పంట పొలాల వద్ద వెళ్లాలంటే రైతులు భయందోళనకు గురవుతున్నారు. ఆవులను, దూడలను చంపేస్తున్నది చిరుతేనని ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. రెండు గ్రామాలు పక్క పక్కనే ఉండటంతో ఈ ప్రాంతంలో సంసంచరించేది ఒక్కటే చిరుత అని ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు.



దమ్మన్నపేట వద్ద చిరుత దాడిలో మృతి చెందిన దూడ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అంజలి, డిప్యూటీ రేంజ్ అధికారి



గోరంటాల, దమ్మన్నపేట రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నది వాస్తవమే. దాడులు చేసిన సంఘటనల ప్రదేశాలను పరిశీలించాం. చిరుత అడుగులేనని తేలింది. ఆవులను, పాడి గేదలను, దూడలను రైతులు ఇంటి వద్దే ఉంచాలి. ఈ రెండు గ్రామాల రైతులు రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లొద్దు.

సుద్దాలలో మహిళ ఆత్మహత్య

సుల్తానాబాద్, ఆగస్టు 6: సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామంలో ఓ వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. సుద్దాల గ్రామానికి చెందిన ఆల్లాడి శ్రీలత (45) గ్రామంలోని వారి స్వంత ఇంటిలో ఒక్కతే ఉంటోంది. ఆమె భర్త ఇరవై సంవత్సరాల క్రితం కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రస్తుతం మృతురాలి ఇద్దరు కుమారులు కార్తీక్‌రావు, కళ్యాణ్‌రావు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు అందరితో మాట్లాడిన శ్రీలత మంగళవారం తెల్లవారేసరికి ఎంతకూ లేవక పోవడంతో కిటికిలోంచి చూస్తే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంది. కడుపునొప్పి భరించలేక తన తల్లి ఆత్మహత్యకు పాల్పడిందని పెద్ద కుమారుడు కార్తీక్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

మంథనిరూరల్, ఆగస్టు 6: మండలంలోని గుమ్నూనూరు గ్రామంలో బండారి రాజ్‌కుమార్(23) అనే యువకుడు ఇంటి ఆవరణలోని రేకుల షెడ్‌లో మంగళవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఊషన్నపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ గుమ్మునూరులోని తన బంధువుల ఇంట్లో ఉంటూ రెండు రోజుల క్రితం మంథనిలో ఓ షాపుకు వెళ్లి నకిలీ ఫోన్‌పే ద్వారా రూ. 300 పంపి నగదు తీసుకున్నాడు. మళ్లీ సోమవారం కూడా అదే షాపునకు వెళ్లి రూ. 500 నకిలీ ఫోన్‌పే ద్వారా పంపి నగదు రూపంలో ఐదు వందలు ఇవ్వాలని షాపు అతన్ని కోరగా తనకు రెండు సార్లు డబ్బులు తన ఖాతాకు రాలేదని గుర్తించిన షాపు యాజమానికి సాయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేస్తున్న క్రమంలో తీసిన వీడియోలను ఓ వ్యక్తి తన సోషల్ మీడియా ద్వారా వైరల్ చేయగా రాజ్‌కుమార్ మనస్థాపం చెంది ఉరివేసుకొని చనిపోయాడని, షాపు యాజమానికి, వీడియో వైరల్ చేసిన వ్యక్తిపై తల్లి తిరుమల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఓదెల, ఆగస్టు 6: మండలంలోని మడకకు చెందిన నేదురి రాజ కొమురయ్య (51) అనే వ్యక్తి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు ఈ విధంగా ఉన్నాయి. మడకలో పంక్చర్ కొట్టు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రాజ కొమురయ్య అప్పుల బాధతో పాటు మద్యానికి బానిసై ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని తెలిపారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యు లు సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు.

భోజన్నపేటలో యువకుడు..

పెద్దపల్లి రూరల్,ఆగస్టు 6: మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన కునారపు రవికిరణ్ (31) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రవి కిరణ్ కరోనాకు ముందు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడని కరోనా వచ్చాక ఉద్యోగాన్ని వదిలి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. అప్పటి నుండి ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతో మనస్థాపం చెందేవాడని సోమవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకున్నట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి , మెరుగైనా వైద్యం కోసం కరీంనగర్ తరలించాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా మంగళవారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

మామిడాలపల్లిలో వృద్ధురాలి మృతి

వీణవంక,ఆగస్టు6: మండలంలోని మామిడాలపల్లి గ్రామనికి చెందిన దర్పల్లి మల్లమ్మ (80) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లమ్మ, ఒంటరిగా ఉంటూ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కూమారుడు దర్పల్లి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

గంజాయి విక్రయిస్తూ హైదరాబాద్‌లో పట్టుబడ్డ పెద్దపల్లి యువకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 6: హైదరాబాద్‌లో గంజాయి విక్రయిస్తూ పెద్దపల్లి యువకులు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులకు పట్టుబడ్డారు. ఆంధ్రా ఒరిస్సా బార్డర్‌లో 4 వేల రూపాయలకు కిలో చొప్పున కొనుగోలు చేసి హైదారాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్కువ ధరలకు అమ్మకాలు సాగిస్తున్న ముగ్గురు పెద్దపల్లి యువకులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అప్పన్నపేటకు చెందిన ఆకుల మిత్రచెతన్య, నిట్టూరు కు చెందిన మహ్మమద్ లతీఫ్‌తో పాటు ఇల్లకుంటకు చెందిన దామ్మని అరవింద్‌లు గుర్తించారు. ఈ గంజాయిని పెద్దపల్లికి చెందిన బండి సాయి చరణ్ విశాఖ సీలేరు నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు తేలింది. వీరిని పట్టకున్న వారిలో ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ సీఐ ఓంకార్, ఎక్సై శ్రీనివాసులు, పి, నరేష్‌లు ఉన్నారు.

కొండగట్టులో శ్రావణ సందడి



కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, ఆగస్టు 6: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శ్రావణ సందడి నెలకొంది. మంగళవారం వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కాగ శ్రావణ సప్తాహ ఉత్సవాలు రెండవ రోజు కొనసాగాయి. అంజనేయ స్వామి, వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

త్రివేణి సంగమం పట్టుచీర ఆవిష్కరణ

● సిరిసిల్ల నేత కార్మికుడి మరో ప్రయోగం



పట్టుచీరను అవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

సిరిసిల్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వినూత్న ప్రయోగాలతో చేనేత వైభవాన్ని చాటుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ మరో పట్టుచీరను ఆవిష్కరించాడు. పట్టుచీరకు సంబంధించిన రంగుల డైయింగ్‌కు ఉపయోగించిన నీటిని గంగ, జమున, సరస్వతి నదుల నుంచి తీసుకురావడం విశేషం. రూ.25 వేలు ఖర్చు చేసి 5.50 మీటర్ల పొడవుతో పట్టు చీరను నేశాడు. మూడు నదుల నీళ్లను ఉపయోగించినందున ఈ పట్టుచీరకు త్రివేణి సంగమం సారీగా నామకరణం చేశాడు. మంగళవారం వరంగల్ జిల్లాలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా త్రివేణి సంగమం పట్టుచీరను ఆవిష్కరించారు. ఇప్పటికే విజయ్ అగ్గిపెట్టె, ఉంగరంలో అమిరే చీరలతోపాటు, కుట్టులేని వస్త్రాలు, బంగారు, వెండిని ఉపయోగించి చీరలను నేసి ప్రశంసలందుకున్నాడు.

డిటైర్డ్ డీఎస్పీ నర్సయ్యకు డీజీపీ సత్కారం


ప్రశంసపత్రం అందజేస్తున్న డీజీపీ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 6: జగిత్యాల జిల్లా వెల్గటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2009లో జరిగిన హత్యకేసును ఛేదించడంతో నిందితులకు ఇటీవల యావజ్జీవ కారాగార శిక్షపడడంలో కృషి చేసిన సిరిసిల్ల రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్యను మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో డీజీపీ రవిగుప్తా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రశంసపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 కేసుల్లో దోషులకు శిక్షలు పడేందుకు కృషి చేసిన డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్‌లు, రిటైర్డ్ పోలీసు అధికారులు, ఏపీపీలు, పీపీలకు డీజీపీ ప్రశంసపత్రాలు అందజేశారు. హన్మకొండకు చెందిన నర్సయ్య సిరిసిల్లలో డీఎస్పీగా 2016లో రిటైర్డ్ అయ్యారు.

నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి

ఇల్లంతకుంట, ఆగస్టు 6: నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి నిలుస్తుందని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, రేపాకలో మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీలు కరివెద స్వప్నకర్ణాకర్ రెడ్డి, సుమలతమల్లేశం, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట :ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. నాయకులు సందీప్, పర్శరాములు, వెంకటనర్సింహారెడ్డి, దేవేందర్, బాలాగౌడ్ పాల్గొన్నారు.

కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 6: మధ్యమానేరు కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. మంగళవారం డీటీ సత్యనారాయణకు వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యమానేరు కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేసినట్లయితే పలు గ్రామాల రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. సరైన వర్షాలు లేక పంటలు పండే పరిస్థితి లేదన్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటిని ఇచ్చినట్లు కుడికాలువకు నీటిని విడుదల చేస్తే ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. నీటి విడుదల చేయకపోయినట్లయితే త్వరలోనే కెనాల్ వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. రైతులు కేవీఎన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంజనేయులు, మద్కాడి రవి తదితరులు ఉన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తించేలా చూడాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6: రుణమాఫీ అర్హులైన రైతులకు వర్తించేలా చూడాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రుణమాఫీ వర్తించకపోవడంతో మంగళవారం బ్యాంకు అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం వర్తింపజేసిన బ్యాంకులో ఎందుకు రుణమాఫీ కావడం లేదని అడిగి తెలుసుకున్నారు. చిన్న తప్పిదంతో రైతుల ఖాతాలో జమ కావడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులైన రైతులకు అందేలా చర్యలు తీసుకుంటానని బ్యాంక్ మేనేజర్ స్పష్టంచేశారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి ఉన్నారు.

దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6: ఎన్నికల్లో దళితులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మంతుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు మంగళవారం ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులకు అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షలు అందిస్తామన్నారని, దళితుల ఓట్లతో గద్దెనెక్కిన సర్కార్ అన్యాయం చేసిందని అన్నారు. అనంతరం తహసీల్దార్ రామచంద్రంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వేణు, రవీందర్‌నాయక్, అంజనేయులు, రవి, రమేశ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

నేడు పంచాయతీ కార్మికుల ఒక్కరోజు సమ్మె

తంగళ్లపల్లి, ఆగస్టు 6: తమ సమస్యలు పరిష్కరించాలని బుధవారం 'సఫాయి బంద్' పేరుతో ఒక్కరోజు సమ్మె నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్మికులు తెలిపారు. బుధవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, వేతనాల పేరుతో విడుదల చేసిన గ్రాంట్‌ను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మిక సంఘాల నాయకులు కోల చంద్రయ్య, బుర్ర శ్రీనివాస్ గౌడ్, లింగంపల్లి కృష్ణవేణి, అన్నల్దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి, ఆగస్టు 6: వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జూన్, జూలై వేతనాలు రాలేదన్నారు. వెంటనే బదిలీలు చేపట్టాలని, 010 పద్దు ద్వారా వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

చెట్లపొదల తొలగింపు

ముస్తాబాద్, ఆగస్టు 6: ముస్తాబాద్ మండలం నామాపూర్ క్రాస్ రోడ్డు, గూడెం వరకు మూల మలుపుల వద్ద చెట్లు పొదలతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకుం టున్నాయి. దీంతో ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు మూల మలుపుల వద్ద ఏపుగా పెరిగిన పొదలను, చెట్ల కొమ్మలను తొలగించారు.

ఆర్పీపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 6: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో స్వర్ణిమ స్లమ్ సమాఖ్యకు చెందిన శ్రీనిధి నిధులను దుర్వినియోగం చేసిన ఆర్పీపైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషర్‌కు ఫిర్యాదు చేసినట్లు పెరుమండ్ల వనజ మంగళవారం తెలిపారు. స్వర్ణిమ స్లమ్ సమాఖ్య శ్రీనిధి లోన్ డబ్బులు రూ.7లక్షలు తమ పేర్లపై తీసుకొని ఆర్పీ సొంతానికి వాడుకున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే తమను దూషిస్తున్నట్లు తెలిపారు. సభ్యుల నుంచి ప్రతీనె రూ. 1000 తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 6: నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు ప్రకటనలో కోరారు. మధ్యమానేరులో నీటి నిలువ పెరిగినందున కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని పేర్కొన్నారు. సమృద్ధిగా వర్షాలు కురవక వల్లంపట్ల, కందికట్కూర్, వంతడుపుల, పొత్తూర్, కిష్టరావుపల్లె, రంగపేట, పండలాపురం, నర్సక్కపేట, జవారిపేట, గాలిపెల్లి తదితర గ్రామాల రైతులు వరినాట్లు వేయలేదని తెలిపారు. ఎమ్మెల్యే, ఇరిగేషన్ అధికారులు చొరవ తీసుకోవాలని, కుడికాలువకు నీటిని విడుదల చేసి రైతాంగానికి అండగా నిలువాలని కోరారు.

సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

వేములవాడ టౌన్, ఆగస్టు 6: వేములవాడ పట్టణంలో సోమవారం కేరళ వరద బాధితుల కోసం సీపీఎం నాయకులు విరాళాలను సేకరించారు. నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, అశోక్, విమల, ప్రశాంత్, శ్రీధర్ ఉన్నారు.

వర్గీకరణ విజయం అమరులకు అంకితం

గంభీరావుపేట, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రక విజయమని, ఇది మాదిగ అమరులకు అంకితమని మాదిగ దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం గంభీరావుపేట మండలం జగ్జీవన్‌రామ్ కాలనీలో సంబరాలు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి సస్పెండ్

చందుర్తి, ఆగస్టు 6:చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి ఎ.గంగారెడ్డిని సస్పెండ్ చేసినట్లు జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘంలో బినామి రైతుల పేరిట అవకతవకలపై వచ్చిన ఆరోపణలపై అసిస్టెంట్ రిజిస్టర్ అరుణ్ జ్యోతి విచారణ చేపట్టారని, సంఘం కార్యదర్శి గంగారెడ్డి రైతుల నుంచి వసూలు చేసిన రూ.32 లక్షలు సంఘంలో జమ చేయకుండా అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని పేర్కొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

సిరిసిల్ల టౌన్/సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 6: తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని, ఆయన సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జీవితాన్ని తెలంగాణ ఉద్యమానికి స్వరాష్ట్ర ఏర్పాటుకు అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. తొలిదశ ఉద్యమంలో పోరాడి మలిదశలో స్వరాష్ట్ర సాధనకు మార్గ దర్శకంగా నిలిచారన్నారు. జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రమేష్‌కుమార్ నివాళ్లు అర్పించారు.

● సిరిసిల్ల పట్టణంలోని వికాస్ డీగ్రీ, ఫీజీ కళాశాలల్లో యాజమాన్యం నివాళ్లు అర్పించాయి. ప్రిన్సిపాల్ జగన్‌గౌడ్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ మధు పాల్గొన్నారు.

● సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు నివాళ్లు అర్పించారు.

● సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటం వద్ద చైర్ పర్సన్ కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ మీర్జా ఫసహత్ బేగ్ ఆలీ, కౌన్సిలర్లు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు పాటు పడాలన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్

● సిరిసిల్ల పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ మురళి, మాజీ చైర్మన్ గాజుల నారాయణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి నిర్వహించారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ ఎండీ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, కొట్టెపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి అదనపు ఎస్పీ చంద్రయ్య నివాళులు అర్పించారు. ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, సీఐ శ్రీనివాస్, ఏవో పద్మ పాల్గొన్నారు.

● సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులు నివాళులు అర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవ రెడ్డి, కార్యదర్శి వెంకటి, న్యాయవాదులు పాల్గొన్నారు.


డీఈవో కార్యాలయంలో..

ఇల్లంతకుంట: విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్, తహసీల్ కార్యాలయాలతోపాటు వివిధ గ్రామాల్లో అధికారులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి అర్పించారు. అల్మాస్‌పూర్‌లోని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు కార్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో పాక ధర్మపురి ఉన్నారు.


నివాళులు అర్పిస్తున్న అదనపు ఎస్పీ

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జయశంకర్‌కు నివాళి అర్పించారు. తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, డీటీ జయంతి పాల్గొన్నారు.

బోయినపల్లి: బోయినపల్లి మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం మండల అధ్యక్షుడు వుదారి నరసింహ చారీ ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ జయంతి నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి పాలోజి జగదీ శ్వరాచారీ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : మండల కేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు, సనుగుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయులు ముఖేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీలత, సెస్ డైరెక్టర్ గంగారాం పాల్గొన్నారు.


17వ పోలీస్ బెటాలియన్‌లో..


సిరిసిల్ల సెస్‌లో..


బీఆర్‌ఎస్ కార్యాలయంలో..


నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు

అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఇల్లంతకుంట, ఆగస్టు 6:అర్హులైన దివ్యాంగులందరికీ ఉపకరణాలు పంపిణీ చేస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 10వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. కలెక్టర్ చొరవతో శిబిరాలు నిర్వహించడమే కాకుండా ఉపకరణాలు అందించడం గొప్ప విషయమన్నారు. డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్డీవో శేషాద్రి, మండల ప్రత్యేకాధికారి బుద్ధ నాయుడు, సీడీపీవో సబిత, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి వెంకటి ఉన్నారు.

● మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. జాతీయ స్థాయి షాట్‌పుట్‌లో రాణించిన విద్యార్థులను అభినందించారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లకు దారిలేకపోవడంతో సమస్యను పరిష్కరించి, త్వరలోనే అర్హులకు పంపిణీ చేస్తామని తెలిపారు. దెబ్బతిన్న వెంకట్రావుపల్లె రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

దళితుల భూములు లాక్కున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు అభివృద్ధి కార్యక్రమాల పేరిట జిల్లాలోని పేద దళితుల నుంచి దాదాపు 10వేల ఎకరాలను లాక్కుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని కార్మిక భవనలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ఆ భూములను పేద దళితులకు ఇవ్వాలన్నారు. 30 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అసైన్డ్‌భూములకు పట్టాలిస్తే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బలవంతంగా తీసుకుందన్నారు. మిడ్ మానేరు కరకట్టకు 120 ఎకరాల పేదల భూమిని లాక్కొని వారిని రోడ్డున పడేసిందన్నారు. కనీసం పరిహారం కూడా ఇవ్వక పోవడంతో వారి బతుకులు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా హరితహారం, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, డబ్బుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు పేదల భూములను లాక్కుందన్నారు. వేములవాడ మండలం మర్రిపల్లిలో దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిలో దళిత పేదలకు 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం పట్టాలిచ్చిందని అక్కడే వారు ఆవులతో జీవనోపాధి పొందుతుండగా ధరణి వచ్చి ఆ భూములకు పట్టాలు లేకుండా చేసిందని అన్నారు. దళితులు తీవ్రంగా వ్యతిరేకించడంతో నిలిచిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, సీపీఐ జిల్లా నాయకులు వేణు, చంద్రం, బాలరాజు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 6: ఆల్‌స్టైల్స్ కుంగుఫూ యూనిట్ ఆఫ్ తెలంగాణ మాస్టర్స్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి కుంగుఫూ, కరాటే చాంపియన్‌షిప్- 24 పోటీల కరపత్రాన్ని జిల్లా మాస్టర్లు ఆవిష్కరించారు. ఈ నెల 25న రాష్ట్ర స్థాయి పోటీలు కరీంనగర్ రెవెన్యూ గార్డెన్‌లో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆల్‌స్టైల్స్ కుంగుఫూ యూనిట్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి వడ్నాల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా మాస్టర్స్ మామిడాల సమ్మయ్య, ఎనగందుల శ్రీనివాస్, ఎండీ సమీనా, గుగ్గారి దివ్య, విక్రమ్‌గాంధీ, బాలరాజు, పెద్దిరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

అసత్యపు ప్రచారాలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్

వేములవాడ టౌన్, ఆగస్టు 6 : వేములవాడ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టి వారానికి, 15 రోజులకు ఒకసారి అభివృద్ధి పేరిట అసత్యపు ప్రచారాలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు కాలం వెల్లదీస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. వేములవాడ పట్టణంలో మంగళవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్, శ్రీకాంత్, ఈర్లపెల్లి రాజులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు వారానికి ఒక ప్రెస్‌మీట్ ఏర్పాటు చేస్తూ అసత్యపు పోకడలకు పోతున్నారని విమర్శించారు. మాజీ జడ్పీచైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, నాయకులు కంకణాల క్రాంతికుమార్, కుమ్మరి శ్రీనివాస్, వాసాల శ్రీనివాస్, అంజద్‌పాషా, దుర్మట్ల వెంకట్‌రెడ్డి, మైలారం రాము, కమలాకర్‌రెడ్డి, పోతు అనిల్, బత్తుల మహేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి శివారులో పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన అల్లెపు శ్రీనివాస్ టాటా ఏసీ వాహనంలో ఇసుకను తరలిస్తుండగా తనిఖీ చేశామని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

జాండిస్‌తో యువ రైతు మృతి

చందుర్తి, ఆగస్టు 6: చందుర్తి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి హరీష్(28) అనే యువరైతు జాండిస్‌తో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. హరీష్ మూడు రోజులుగా రక్త కణాలు తగ్గడంతోపాటు, జాండిస్, వైరల్ కార్డియోమయోపతితో కరీంనగర్‌లోని ఓ అసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాదులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు.

సిరిసిల్లలో న్యాయవాదుల బైక్ ర్యాలీ

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 6: కోర్టు ఉత్తర్వులను పోలీసులు బేఖాతరు చేశారని సిరిసిల్ల పట్టణంలో జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సిరిసిల్లకు చెందిన ఓ సీనియర్ న్యాయవాదికి కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ అతనిపై పోలీసులు రెండు క్రిమినల్ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1నుంచి న్యాయవాదులు నిరవధికంగా విధులను బహిష్కరణకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సిరిసిల్ల, వేములవాడ న్యాయవాదులు ఆరో రోజు కోర్టు విధులు బహిష్కరించారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● కోర్టు ఉత్తర్వుల అమలులో పోలీస్‌శాఖ నిర్లక్ష్యంపై న్యాయవాదులు ఐదురోజులుగా చేస్తున్న ఆందోళనకు పోలీసు అధికార యంత్రాంగం కదిలివచ్చింది. సిరిసిల్ల జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులతో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ మురళీకృష్ణ, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ దాదాపు రెండుగంటలు చర్చలు జరిపారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆందోళనలను నిలిపివేయాలని కోరారు. న్యాయవాదులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను డీఎస్పీల దృష్టికి తీసుకెళ్లారు. సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం చేసుకోరాదని, కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని, న్యాయవాదులపై అక్రమ కేసులు వద్దని, పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లే న్యాయవాదులకు ఎస్‌హెచ్‌వోలు కనీస మర్యాద ఇవ్వాలని అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవ రెడ్డి, కార్యదర్శి వెంకటి డీఎస్పీల ముందు ఉంచారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ప్రజల గుండెల్లో నిలిచిన నేత కేటీఆర్


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 6: మాజీ మంత్రి కేటీఆర్ దాదాపు రూ.3500 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, కార్మికులను ఆదుకొని ప్రజల గుండెలో నిలిచిన నేతని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల అభివృద్ధి ఎవరి ద్వారా జరిగిందో ప్రజలకు తెలుసని, కేకే మహేందర్‌రెడ్డికి కనిపించడం లేదని అన్నారు. అభివృద్ధిని చూసే ప్రజలు కేటీఆర్‌ను ఐదు సార్లు ఎమ్మెల్యే గెలిపించారని, మహేందర్‌రెడ్డిని ఛీత్కరించారని అన్నారు. ప్రజాక్షేత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నిసార్లు ఓడిపోయినా బుద్ధిరాలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిస్తే ఎమ్మెల్యేగా గెలిచినట్లు వాడవాడలకు పోయి అభివృద్ధి పనులకు కొబ్బరి కాయలు కొట్టే అల్పసంతోషని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను నిందించేటప్పుడు పక్కన ఉన్న వస్త్ర వ్యాపారులు ఆలోచన చేయాలన్నారు. జిల్లాను కేటీఆర్ రాష్ట్రంలో ముందంజలో నిలిపారన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ ఒక అబద్ధాన్ని పదే పదే ప్రచారం చేయడంతో నిజమని ప్రజలు భ్రమపడే అవకాశం ఉందన్నారు. గత ఎన్నికలో కాంగ్రెస్ ప్రయత్నం చేసి కొంత వరకు సఫలీకృతమైందన్నారు. 2004లో కార్మికులు ఆత్మహత్యలక పాల్పడితే కేకే మహేందర్‌రెడ్డి ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. 2016లో కేసీఆర్ బతుకమ్మ చీరలతో ఓ మలుపు తీసుకొచ్చారన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి, కౌన్సిలర్లు కల్లూరి రాజు, అన్నారపు శ్రీనివాస్,నాయకులు దార్ల సందీప్, రాఘవరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


జయవరంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల టౌన్/వేములవాడ రూరల్, ఆగస్టు 6: ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా జయవరం గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లోరినేషన్ తర్వాతే ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లోని శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ప్రత్యేక అధికారి లక్ష్మీరాజం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం నిజామాబాద్, కనగర్తి గ్రామాల్లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, మండల ప్రత్యేక అధికారి ఆర్డీవో రాజేశ్వర్ మంగళవారం తనిఖీ చేశారు. కనగర్తిలో వాటర్ ట్యాంక్ వద్ద హోటల్‌లోని వ్యర్థాలను పడేయడంతో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద ఉందని ప్రజలు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

● పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని రూపొందించిందని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం మూడవ వార్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛదనం - పచ్చదనం కరపత్రాన్ని ఆవిష్కరించారు. మూడో వార్డు అభయాంజనేయ దేవాలయం ముందు నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్వచ్ఛదనంలో భాగంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీధి కుక్కలు, వానరాలతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రభుత్వం ఈ సమస్య నివారణ కోసం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫాసహత్ బేగ్ అలీ, డీఈ ప్రసాద్, ఏఈ నరసింహస్వామి, టీపీఎస్ అభినవ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : మండలంలోని తాడూరు, పాపాయిపల్లెలో ఆర్డీవో రమేష్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ స్వచ్ఛదనం - పచ్చదనంలో భాగంగా మంగళవారం పర్యటించారు. ప్రజలకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు.

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో మంగళవారం క్లోరినేషన్ కార్యక్రమాన్ని చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ముదాం సతీష్, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ అఖిల్, ఏఎన్ఎం వరమ్మ ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లో అధికారులు పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామాల్లోని తాగు నీటి ట్యాంకుల చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేయించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో స్వచ్ఛదనం - పచ్చదనం ర్యాలీ